క్లుప్తంగా

స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మంజుల



నగరంపాలెం: స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బి.మంజుల నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె సోమవారం తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో లా విద్యభ్యాసం చేయగా, సీనియర్ న్యాయవాది చాగంటి రఘురామిరెడ్డి వద్ద జూనియర్‌గా పనిచేశారు. 2004లో బార్ అసోసియేషన్ మహిళా కార్యదర్శిగా కొనసాగారు. విద్యుత్ కేసులకు సంబంధించి మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులవ్వగా, మూడేళ్ల పదవిలో కొనసాగనున్నారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేటలోని గౌరి విశ్వేశ్వరాలయంలో స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా సోమవారం స్వామివారికి వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, ఆలయ అర్చకులు విశ్వేశ్వరశర్మ, జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్ కుమార్ శర్మ, మల్లికార్జునశర్మ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రంగావఝ్జల సత్యనారాయణ, శశికళ, పాశం మధు, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

బాకీ అడిగిందని మద్యం సీసాతో దాడి

నగరంపాలెం: బాకీ అడిగినందుకు మహిళపై మద్యం సీసాతో దాడికి పాల్పడిన ఘటనపై అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. శారద కాలనీ 16వ వీధికి చెందిన పి.మరియమ్మ సుమారు ఆరు నెలలు క్రితం అదే ప్రాంతానికి చెందిన ఎం.మణికి రూ.10 వేలు అప్పు ఇచ్చింది. డబ్బులు తిరిగి అడిగితే ఇవ్వలేదు. ఈ క్రమంలో సోమవారం మరోసారి మణిని డబ్బులు విషయమై.. మరియమ్మ ప్రశ్నించగా.. అతను ఆమెపై మద్యం సీసాతో దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ద్విచక్ర వాహనం అపహరణపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. కళాకారుల కాలనీ 2వ వీధికి చెందిన కృపానంద్ ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని నాలుగు రోజుల క్రితం దొంగలించారు. దీనిపై బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: కరాటే పోటీల్లో అరండల్ పేటలోని 'కెనడీ నెక్స్ట్ జెన్ కిడ్స్' విద్యార్థుల ప్రతిభ కనబర్చారని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీవిద్య అన్నారు. ఈ నెల 17న స్థానిక డొంక రోడ్డులోని ఏఎస్ జూడో కరాటే బాడీ ఫిట్‌నెస్ అకాడమీలో ఆర్బీడీఎస్‌కే ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కరాటే బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. సుమారు 97 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. పాఠశాలలో సోమవారం విజేతలకు మెడల్స్ అందజేసి, అభినంధించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జి కె.వసంతలక్ష్మి, కోచ్ ఆలపాటి రవికుమార్, అసిస్టెంట్ కోచ్ ఎ.లక్ష్మీ ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

పొన్నూరు: నిడుబ్రోలులోని పీబీఎన్ కళాశాలలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్షుడు ఎస్.అంకప్ప చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో జాబ్‌మేళాకు సంబంధించిన బ్రోచర్‌ను అంకప్పచౌదరి ఆవిష్కరించారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే జాబ్‌మేళాలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, బీఎస్సీ, బీకాం, బీసీఏ ఉత్తీర్ణులైన విద్యార్థులు పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివకుమారి, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ కె.శ్రీనివాసరావు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

చావలి(వేమూరు): పురుగుల మందు తాగి సోమరౌతు వెంకయ్య(60) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వేమూరు మండలంలోని చావలి గ్రామానికి చెందిన సోమరౌతు వెంకయ్య ఆదివారం ఉదయం ఇంటి వద్ద పురుగుల మందు సేవించాడు. భార్య చూసి ఇంటి పక్క వారికి చెప్పడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యసేవలు అందిస్తున్న క్రమంలో సాయంత్రం 6 గంటలకు మృతి చెందినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

దళిత వర్గాలకు పెద్దపీట

గుంటూరు తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి నూరి ఫాతిమా

పట్నంబజారు: దళిత వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. సోమవారం 54వ డివిజన్ కార్పొరేటర్ మల్లవరపు రమ్య ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో దళిత ముఖ్య నేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడారు. దళితులకు పూర్తిస్థాయిలో అన్ని సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని పిలుపునిచ్చారు.



ప్రార్థన మందిరానికి శంకుస్థాపన చేస్తున్న నూరి ఫాతిమా

అనంతరం డివిజన్‌లోని షకేము ప్రార్థన మందిరం రెండో అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నేతలు మల్లవరపు రవిరాజ్, దాసు, షకేము ప్రార్థన మందిరం సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని 55వ డివిజన్‌కు చెందిన పేటేటి బాజీ.. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నేపథ్యంలో ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో నూరి ఫాతిమాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను గజమాలతో సత్కరించారు. అనంతరం బాజీని ఫాతిమా దుశ్శాలువాతో సత్కరించారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ విభాగం నేతలు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, పార్టీ నేతలు అజయ్, హర్ష, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ప్రగతిలో ఏజెంట్లది ప్రధాన భూమిక

కొరిటెపాడు(గుంటూరు): ఎల్ఐసీ సాధిస్తున్న అద్భుతమైన అభివృద్ధిలో ఏజెంట్లు ముఖ్యపాత్ర పోషించడం అభినందనీయమని శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. 'మెగా బిజినెస్ డే' సందర్భంగా అత్యధిక పాలసీలు చేసిన ఏజెంట్లను సోమవారం అరండల్‌పేట ఎల్ఐసీ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ జాతీయకరణ నాటి నుంచి పాలసీ దారులకు విశిష్టమైన సేవలందిస్తూ ఎల్ఐసీ దేశ ప్రగతికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను అందిస్తోందన్నారు. నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఇ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బీమా వ్యాపారంలో ఎదురవుతున్న గట్టి పోటీని తట్టుకుని సుమారు 13 లక్షల మంది ఏజెంట్లు ఎల్ఐసీని అగ్రగామి సంస్థగా నిలపటంలో కీలక భాగస్వాములయ్యారని



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, శ్రీనివాసరావు, రవీంద్ర

ప్రశంసించారు. సీనియర్ బ్రాంచి మేనేజర్ జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ బి.రవీంద్ర, జె.రాజేంద్రప్రసాద్, ఎ.సత్యవాణి, ఎస్.కృష్ణారెడ్డి, జి.బాలాజి, కనక రాజలక్ష్మి, ఎ.సుబ్బాయమ్మ, శ్రీనివాస్, డి.ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ చికిత్సపై అవగాహన



సుజకో థెరపీని ప్రయోగాత్మకంగా వివరిస్తున్న శశికాంత్ శర్మ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రత్యామ్నాయ చికిత్స పద్ధతులపై అవగాహన అవసరమని హైదరాబాద్‌కు చెందిన ఆచార్య శశికాంత్ శర్మ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం భారత్ వికాస్ పరిషత్ గుంటూరు శాఖ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ అధ్యక్షతన ఆరోగ్యంపై అవగాహన, ప్రత్యామ్నాయ చికిత్సా పద్ధతులపై సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న శశికాంత్ శర్మ దక్షిణ కొరియాకు చెందిన సుజకో థెరపీ విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ కార్యదర్శి అంకిత్ కుమార్ జైన్ సలేచ, ఆర్థిక కార్యదర్శి చిన్నం చలమయ్య, కన్వీనర్ పి.శేఖర్, జాతీయ కార్యవర్గ సభ్యులు మల్లికార్జునరావు, కేవీ బ్రహ్మం, యోగా నిపుణులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు సేవలు అందించాల్సిన బాధ్యత అందరి వైద్యులపై ఉందని డాక్టర్ పాదిల ప్రసాద్ అన్నారు. సోమవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌తో కలిసి అడ్వాన్స్‌డు ఐసీయూతో పాటు పలు వార్డులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిరణ్ కుమార్ వచ్చిన తర్వాత ఆసుపత్రి రూపు రేఖలు మారాయన్నారు. బాధ్యతగా పని చేస్తూ రోగులకు సేవలు అందించే విషయంలో అందరిని కలుపుకుంటూ ఆసుపత్రిని అభివృద్ధి పథంలోకి తీసుకుని వెళ్తున్నారని అభినందించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ



వార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రసాద్, డాక్టర్ కిరణ్‌కుమార్

పాదిల ప్రసాద్ బ్లాక్‌లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర సేవలు అందిస్తున్నామని చెప్పారు. పేద ప్రజలకు పాదిలి ప్రసాద్ అండగా నిలుస్తున్నారని చెప్పారు.

ఉపవాసం..ఆరోగ్యం జరభద్రం

- కఠోర రంజాన్ ఉపవాస దీక్షల్లో ముస్లింలు
- మధుమేహులకు ఆహార నియమాలు తప్పనిసరి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

గుంటూరు మెడికల్ : పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలు చేస్తున్నారు. సుమారు 40 రోజుల పాటు సాగే ఉప వాస దీక్షల్లో మధుమేహులు తగు ఆహార నియమాలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. లేకుంటే మరిన్ని ఆరోగ్య సమస్యలు తప్పవని చెప్తున్నారు. ఉపవాసం ప్రారంభించే ముందుగా డాక్టర్‌తో అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలి. మధుమేహం ఎంత ఉందో తెలుసుకోవాలి. ఉపవాసంలో భక్తులు 12 గంటలు ఎటువంటి ఆహారం తీసుకోరు. కాబట్టి దానికి తగినట్లుగా మధుమేహ ఇన్సులిన్ డోసులో డాక్టర్‌ను సంప్రదించి మార్పు చేయించుకోవాలి. సాధారణ రోజుల్లో తీసుకునే డోసునే తీసుకుంటే చాలా ప్రమాదమని వైద్యులు చెప్తున్నారు.

ఆహార నియమాలు ఇలా..

1.తినకూడని పదార్థాలు: పంచదార, బెల్లం, తీపి బిస్కెట్లు, కేకులు, బేకరి వస్తువులు, జామ్, కూల్ డ్రింకులు, తీపి పదార్థాలు, వెన్న, నెయ్యి, వేపుడు కూరలు, బొంబాయి రవ్వ, మైదా, మామిడి, సపోట, సీతాఫలం, జంతువుల లివర్, మెదడు మాంసం, ముదురు మాంసం, బంగాళా దుంప చిప్స్, మద్యం, ఎర్రని మాసం.

2.పరిమితిగా తినదగినవి: వరి, జొన్న, గోధుమ, మొక్కజొన్న, రాగులు, సజ్జ పిండి జల్లెడ పట్టకుండా పొట్టుతో వాడాలి. దుంపకూరలు.



3.తక్కువగా తీసుకోదగినవి: వేరుశనగ గింజలు, జీడిపప్పు, బాదం, పిస్త, కొబ్బరి, ద్రాక్ష పండ్లు, బత్తాయి, కమలా పండ్లను వలుచుకుని తినాలి.

4.ఎక్కువగా తీసుకోవాల్సినవి: అన్నిరకాల ఆకు కూరలు, పప్పులు, వెన్నతీసిన పాలు, మజ్జిగ, బొప్పాయి, జామ, దానిమ్మ, టమాట, క్యాబేజీ, క్యారెట్టు మొదలైనవి.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

పగటిపూట వీలైనంత వరకు నీడ ప్రదేశంలోనే ఉంటూ శారీరక శ్రమ తగ్గించుకోవాలి. ఫలితంగా శరీరంలోని నీటిశాతం తగ్గకుండా నీరసపడకుండా చూసుకోవచ్చు. ఎక్కువ శ్రమ పడితే శ్రమకు తగిన శక్తిని ఇచ్చేందుకు శరీరంలోని చెక్కర (గ్లూకోజ్) తొందరగా ఖర్చు అయిపోయి శరీరం నీరసించి పోతుంది. చమటలు పడ్తాయి. దీనిని హైపోగ్లేసీమియా అంటారు. ఇది కొన్ని సార్లు ప్రాణాంతకం కావచ్చు. బీపీ ఉన్న వాళ్లు ఉప్పు తగ్గించాలి.

రంజాన్ ఉపవాస రోజుల్లో సాధారణ ఆహార పట్టిక

తెల్లవారుజామున (సహరి) :
లేవగానే ఒక గ్లాసు గోరు వెచ్చటినీరు అర నిమ్మకాయ రసంతో తాగాలి. తర్వాత ఒక కప్ (150 ఎం.ఎల్) కాఫీ, టీ.. వెన్నతీసిన పాలతో పంచదార లేకుండా తీసుకోవాలి.

భోజనం:
100 గ్రాముల ముడి బియ్యంతో అన్నం. లేదా 100 గ్రాముల జల్లెడ పట్టని గోధుమ పిండితో పుల్కాలు కూరగాయలు, మాంసం, చేప ఇగురు కూర, ఆకు కూరపప్పు, సాంబారు వెన్నతీసిన మజ్జిగ, పెరుగు, బత్తాయి, కమల, జామ, 20 ద్రాక్ష పండ్లు, యాపిల్, బొప్పాయి ముక్కలు తీసుకోవచ్చును.

ఉపవాసం విరమించేటప్పుడు (ఇఫ్తార్):
తక్షణ శక్తికోసం 5–10 ఎండు ఖర్జూరం, 10–15 కిస్‌మిస్ కానీ తీసుకోవాలి. వీటితో పాటు పుచ్చకాయ, జామ, బొప్పాయి, కమలా, బత్తాయి పండ్లు ముక్కలు తీసుకోవచ్చు. అలాగే కాఫీ, టీకి బదులుగా పాలు, వెన్నతీసిన మజ్జిగ తీసుకోవచ్చు.

రాత్రి:
150 గ్రాముల ముడి బియ్యంతో అన్నం లేదా 150 గ్రాముల గోధమ పిండితో పుల్కా అందులోకి.. మాంసం, చేపలు, చర్మం లేని కోడి మాంసంతో ఇగురుకూర లేదా కూరగాయల పప్పు, సాంబారు, వెన్నతీసిన మజ్జిగ లేదా పెరుగు తీసుకోవచ్చు.

ప్రచార బోర్డుల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

నెహ్రూ నగర్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రైవేటు స్థలాల్లో, భవనాలలో ఏర్పాటు చేసే రాజకీయ పార్టీల ప్రచార ఫ్లెక్సీలు, జెండాలు, బోర్డులకు సదరు స్థల, భవన యజమాని అంగీకార పత్రం తప్పనిసరి అని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ రాజకీయ పార్టీ నేతలకు స్పష్టం చేశారు. సోమవారం రాత్రి తన చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిటీ ప్లానర్ మాట్లాడుతూ.. గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లోని ప్రధాన వీధులు, కూడళ్లలో ఉన్న రాజకీయ పార్టీల బోర్డులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించామన్నారు. మంగళవారం మధ్యాహ్నం నాటికి ప్రైవేటు స్థలాలు, భవనాలలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ప్రచార బోర్డుల తొలగిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని కోరారు. పార్టీల ఆఫీస్‌లకు కూడా



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 4/8 సైజ్‌లో ఒక జెండా, ఒక బోర్డు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఏఈఆర్‌ఓలు వెంకట లక్ష్మి, సునీల్, నిరంజన్, భీమరాజు, సూపరింటెండెంట్ పద్మ, టీడీపీ ప్రతినిధి సీహెచ్ వన్య, బీఎస్పీ ప్రతినిధి సీహెచ్.వాసు, అమ్ ఆద్మీ ప్రతినిధి సేవకుమార్, కాంగ్రెస్‌ప్రతినిధి మహబూబ్ జాని, సీపీఎం నుంచి షేక్ ఖాసిం షాహిద్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కాకుమాను: ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాలలో ఎవరైనా అనుమతులు లేకుండా నగదు, మద్యం తరలిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ రవీంద్ర అన్నారు. మండలంలోని కొమ్మూరు శివారులో సోమవారం రాత్రి ఆయన తన సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ఎవరైన ఓటర్లను నగదు, మద్యం బాటిళ్లు ఇచ్చి ఆకర్షించే విధంగా ఎలాంటి చర్యలు చేపట్టినా అటువంటి వారిని గుర్తించి, వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

నగరంపాలెం: భర్త ఆచూకీ తెలియరాలేదంటూ భార్య పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టాభిపురం పెట్రోల్ బంక్ సమీపాన ఉంటున్న వి.హనుమంతురావు వ్యాపారం చేసేవారు. ఈ నెల మూడో తేదీన హైదరాబాద్ వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలు దేరారు. అయితే అప్పటి నుంచి భర్త ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉందని, తెలిసిన వారి వద్ద విచారించిన ఆచూకీ తెలియలేదని భార్య సుధారాణి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదుల సెల్

ప్రత్తిపాడు: పారదర్శకంగా నిష్పాక్షికంగా ఎన్నికలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమయ్యింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలతో పాటు ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదు చేసేందుకు నియోజకవర్గ స్థాయిలో ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుల సెల్/కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్ తెలిపారు. 24/7 సెల్ పనిచేసేలా సిబ్బందికి విధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ సెంటర్ ద్వారా ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు, విషయాలు స్వీకరించడంతో పాటు సి-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను పర్యవేక్షించడం, సంబంధిత అధికారులను సమయస్వయం చేయడం వంటివి ఉంటాయన్నారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు ఫిర్యాదుల సెల్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఓటర్లు, ప్రజలు 0863-2940262 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, గుంటూరు రూరల్, వట్టి చెరుకూరు, కాకుమాను మండలాల ప్రజలు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్వో కోరారు.

ప్రతి ఖర్చును ఖచ్చితంగా నమోదు చేయాలి

గుంటూరు నగరక కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఆర్వో కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల్లో వ్యయ నిర్వహణ కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని, కమిటీ సభ్యులు అత్యంత జాగ్రత్తగా రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార ఖర్చులు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం తన చాంబరులో కమిటీల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రతి ఖర్చు సంబంధిత ఖాతాలో నమోదు చేయాలని, ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్, ఆర్వోలకు నిర్దేశిత పద్ధతిలో రిపోర్టు ఇవ్వాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ర్యాలీలు, ప్రచార సభలు, కార్యకర్తల ఖర్చులు, ప్రచార సామగ్రి తదితర అంశాల వారీగా వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ నాగేంద్ర కుమార్, ఎంసీసీ బృందం నుంచి శ్రీధర్ పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ఎన్నికల నియమావళి

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. తన చాంబరులో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అధికారులతో సమావేశం నిర్వహించారు. నగరంలోని



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి

ప్రభుత్వ ఆస్తులపై ఉన్న అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలను సోమవారం సాయంత్రానికి పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. పార్కులు, అంతర్గత రహదారుల్లో కూడా రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల కార్యాలయాలకు కూడా నిబంధనల మేరకు జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేసుకునేలా తెలియజేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని తక్షణం తొలగించాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న ప్రతి అధికారి తప్పనిసరిగా వైర్ లెస్ సెట్‌లో అందుబాటులో ఉంటాలని, అనుమతి లేకుండా సెలవు తీసుకోవాడానికి కుదరదన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ శ్యాంసుందర్, సీఎంఓహెచ్ డాక్టర్ ఆశా, డిప్యుటీ కమిషనర్ వెంకట లక్ష్మి, ఏఆర్వోలు సునీల్, భీమరాజు, ఎంసీసీ బృంద సభ్యుడు శ్రీధర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ స్టార్ క్యాంపెయినర్స్ విద్యార్థులే



గజమాలతో విప్ లేళ్ల అప్పిరెడ్డిని ఘనంగా సన్మానిస్తున్న వివిధ విభాగాల నాయకులు

శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్టార్ క్యాంపెయినర్స్‌గా ముందుండి నిలబడతామని విద్యార్థి లోకం చెబుతోందని శాసన మండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లగంటి శ్రీను (గంటి), గురిశెట్టి రవీంద్ర, ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేటేటి నవీన్ (బాజీ) సోమవారం మర్యాదపూర్వకంగా ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డిని కలిశారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎం అయ్యేందుకు తమవంతు కర్తవ్యాన్ని అంతకరణ శద్ధితో నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో విద్యార్థి విభాగం నేతలు విఠల్, మస్తాన్, కరీంలాలా, అజయ్, కెనడీ, మున్నా, గాయ్ కిరణ్, చిన్ని, శివ, సాయి, చైతన్య తదితరులు లేళ్లను కలిశారు.

టీడీఎస్‌పై అవగాహన అవసరం

ఆదాయ పన్ను అధికారి జగదీష్

కొరిటెపాడు: బ్యాంకింగ్ రంగంలో ఉన్న ప్రతి ఒక్కరూ టీడీఎస్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆదాయపుపన్ను శాఖ అధికారి జగదీష్ కోరారు. విజయవాడలోని టీడీఎస్ కమిషనర్ ఆదేశాల మేరకు గుంటూరు ఆదాయ పన్ను శాఖ టీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జీడీసీసీ బ్యాంకులో టీడీఎస్‌పై అవగాహనా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జగదీష్ మాట్లాడుతూ, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది సంపూర్ణ అవగాహనతో సక్రమంగా టీడీఎస్ అమలయ్యేలా చూడాలని సూచించారు. ఆదాయ పన్ను శాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ టీడీఎస్ చెల్లించే అంశంలో పాటించాల్సిన నియమ నిబంధనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జీతాలపై ప్రతి నెలా దామాషా పద్ధతిలో టీడీఎస్ చేయాలనీ.. డిపాజిట్లపై



వివిధ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

వచ్చే వడ్డీతో పాటు, బ్యాంకు భవనాలకు చెల్లించే అద్దె రూ. 2.40 లక్షలు దాటితే విధిగా 10 శాతం టీడీఎస్ ఉంటుందన్నారు. బ్యాంకు సిబ్బంది సందేహాలకు నివృత్తి చేస్తూ పలు సెక్షన్ల కింద బ్యాంకు వసూలు చేయాల్సిన టీడీఎస్ గురించి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లాలోని కోఆపరేటివ్ బ్యాంకుకు సంబంధించిన అన్ని బ్రాంచీల మేనేజర్లు, ఆదాయ పన్ను అధికారి రాజశేఖర్, జీడీసీసీ బ్యాంకు సీఈఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో సామాన్యులకు సత్వర న్యాయం

లక్ష్మీపురం: కోర్టులపై పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడంతోపాటు, సామాన్యులకు సత్వర న్యాయం అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని న్యాయవాది ముప్పాళ్ల వీఎస్.ప్రసాదరావు అన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో న్యాయవాది ముప్పాళ్ల వి.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను ఎలాంటి ఖర్చు లేకుండా ఇరువర్గాల పరస్పర అంగీకారంతో లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులను కొలిక్కి తేవడంలో లోక్ అదాలత్ ప్రత్యేకత అన్నారు. ఈ ఏడాది కోటికి పైగా కేసులు పరిష్కారమైనట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయన్నారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ ఏదైనా సమస్యతో న్యాయస్థానాలకు వెళితే అది పరిష్కారమయ్యేనాటికి ఏళ్లు గడుస్తాయన్నారు. కక్షిదారులు మానసికంగా,



మాట్లాడుతున్న న్యాయవాది ప్రసాదరావు

ఆర్థికంగా చితికపోతున్నారన్నారు. కోర్టులంటే భయపడి చాలా మంది వాటి గడప తొక్కటానికి భయపడుతున్నారన్నారు. ఈ సమస్యలకు లోక్‌అదాలత్‌లు పరిష్కారంగా నిలుస్తున్నాయన్నారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ వనరుల కొరత, నైపుణ్యం కలిగిన సిబ్బంది లేమి, ప్రజల్లో అవగాహన కొరవడటం వల్ల లోక్ అదాలత్‌లు ఆశించిన స్థాయిలో ప్రజలకు చేరువ కాలేకపోతున్నాయన్నారు. సమావేశంలో ఎస్.సదాశివరావు, ఆర్.వి.సింగరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌స్టేషన్లలో మౌలిక సదుపాయాలు

ప్రత్తిపాడు: పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.పద్మజ అన్నారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం, బొర్రావారిపాలెం, పాతమల్లాయపాలెం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను సోమవారం ఆమె పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వెలుపల ర్యాంప్‌లు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, కేంద్రం లోపల విద్యుత్, లైటింగ్..వంటి సౌకర్యాలు ఉన్నాయా లేవా అన్న విషయాలను పరిశీలించారు.